## ఇందిరమ్మ ఇంటి కోసం.. తాత ఇంటిని కూల్చిన మనుమడు!

నిరాశ్రయులైన వృద్ధ దంపతులు • న్యాయం చేయాలని వేడుకోలు



రాజాపూర్‌లో కూల్చిన ఇంటి వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న వృద్ధ దంపతులు

శంకరపట్నం, జూన్ 16: ఇందిరమ్మ ఇంటి కోసం ఓ మనుమడు.. తాత–నానమ్మ నివసిస్తున్న ఇంటినే ధ్వంసం చేశాడు. దీంతో ఆ వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. వృద్ధ దంపతుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలం రాజాపూర్‌కు చెందిన వేల్పుల కనకయ్య–కొమురమ్మ అనే వృద్ధ దంపతులకు ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకు గణేశ్ కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మరో ఇద్దరు కొడుకులు రవి, సురేశ్ హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. పెద్ద కోడలు లక్ష్మి తన కొడుకు ఉదయ్‌తో కలిసి అదే గ్రామంలో పక్కనే మరో షెడ్డులో ఉంటున్నారు. తల్లిదండ్రులు ఉంటున్న ఇల్లు వారి తదనంతరం వాటా ప్రకారం ముగ్గురు కొడుకులకు చెందుతుందని గతంలో పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఇదిలా ఉండగా లక్ష్మి పేరున ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతో పాత ఇంటి స్థలంలోనే ఇల్లు కట్టుకుంటామని మనుమడు ఉదయ్ తాత–నానమ్మతో కొంత కాలంగా గొడవపడుతున్నాడు. అయితే తాము బతికుండగా పాత ఇంటిని ఇవ్వమని, తమ తదనంతరం ఎవరి వాటా వారు తీసుకోవచ్చని వృద్ధ దంపతులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 10న ఉదయ్, అతడి తల్లి లక్ష్మి దౌర్జన్యంగా వృద్ధులు నివసిస్తున్న ఇంటి పెంకులు, కర్ర తొలగించి ధ్వంసం చేశారు. ఈ ఘటనతో వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. చిన్న కొడుకు సురేశ్‌ను వెంటబెట్టుకొని వారు అదే రోజు కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ మనుమడు ఉదయ్, కోడలు లక్ష్మి తాము ఉంటున్న ఇంటిని ధ్వంసం చేసి తమను నిరాశ్రయులుగా మార్చారని వాపోయారు. తమ వయసును కూడా చూడకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్న వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

## కలెక్టర్‌ను అభినందించిన సీఎం



సర్జరీ అనంతరం కలెక్టర్‌తో జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, వైద్యబృందం

విద్యానగర్, జూన్ 16: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(జీజీహెచ్)లో సర్జరీ చేయించుకున్న కలెక్టర్ పమేలా సత్పతిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రభుత్వ దవాఖానల్లో ఆధునిక సదుపాయాలు, అనుభవం ఉన్న వైద్యులు, సేవా దృక్పథం ఉన్న సిబ్బంది ఉన్నారని, సర్కార్ దవాఖానలపై ప్రజలకు నమ్మకాన్ని పెంపొందించినందుకు అభినందనలు అని ట్వీట్ చేశారు. పమేలా సత్పతి సైనాస్, శ్వాస సమస్యలతో ఇబ్బంది పడతుండడంతో ఆమెకు జీజీహెచ్ వైద్యులు ఎండోస్కోపీ, నాసల్, సెప్టోప్లాస్టీ సర్జరీ చేశారు.

## డివిజన్ల పునర్విభజనపై అభ్యంతరాల పరిశీలన పూర్తి

కార్పొరేషన్, జూన్ 16: కరీంనగర్ నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ముసాయిదాపై ఈ నెల 11 వరకు వివిధ వర్గాల నుంచి 234కు పైగా అభ్యంతరాలు రాగా, సోమవారం వరకు వాటి పరిశీలన పూర్తయింది. ఈ నెల 18 వరకు డివిజన్ల పునర్విభజన జాబితా కలెక్టర్‌కు చేరనుండగా.. 19న జిల్లా యంత్రాంగం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తుంది. 21న ప్రభుత్వం డివిజన్ల పునర్విభజన తుది జాబితాను విడుదల చేయనుండగా, అన్ని పార్టీల నేతల్లో ఉత్కంఠ నెలకొన్నది.

## వయోవృద్ధులపై వేధింపులు బాధాకరం

కోర్టుచౌరస్తా, జూన్ 16: రోజు రోజూ వయోవృద్ధులపై వేధింపులు పెరిగిపోతుండడం చాలా బాధాకరమని, ఈ రోజు మనం ఈ స్థితిలో ఉన్నామంటే మన పెద్దలు, వయోవృద్ధుల సలహాలు, మార్గనిర్దేశం వల్లేనని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్ పేర్కొన్నారు. ప్రపంచ వయోవృద్ధులపై వేధింపుల నిరోధక దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని ప్రభుత్వ వయోవృద్ధుల వసతి గృహంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో ఎక్కడ ఉన్నా, ఏ విధమైన న్యాయ సహాయం కావాల్సినా టోల్ ఫ్రీ నంబర్ 15100కు కాల్ చేయవచ్చన్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, వయోవృద్ధుల గృహ నిర్వాహకురాలు రాధిక పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ గడువు 28

కార్పొరేషన్, జూన్ 16: కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు, సుడా పరిధిలోని గ్రామ పంచాయతీలను కలుపుకొని రూపొందించిన సుడా మాస్టర్ ప్లాన్‌పై సూచనలు, అభ్యంతరాల స్వీకరణ కోసం ఇచ్చిన గడువు ఈ నెల 28తో ముస్తున్నదని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కోరారు. సోమవారం సుడా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మాస్టర్ ప్లాన్, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కాగా, మాస్టర్ ప్లాన్ ముసాయిదా రెండు నెలల క్రితం విడుదలవగా, ఇప్పటి వరకు కేవలం 15 సూచనలు మాత్రమే వచ్చినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. సమావేశంలో సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్, సీపీవో ఆంజనేయులు, ఈఈ రొడ్డ యాదగిరి, డీఈ రాజేంద్ర ప్రసాద్, ఏఈ సతీశ్, ఏసీపీలు బషీర్, వేణు, శ్రీధర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, జూన్ 16 : స్థానిక పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పి. సిస్మితరెడ్డి జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన అండర్–17 జూనియర్స్ రాష్ట్రస్థాయి బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న సిస్మితరెడ్డి, 75–80 కేజీల విభాగంలో అద్భుత ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. జూన్ 18 నుంచి 25 వరకు హరియాణా రాష్ట్రంలోని రోహ్‌తక్‌లో జరిగే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. కరీంనగర్‌కు చెందిన సిస్మితరెడ్డి సీపీ గౌష్ ఆలంను సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలువగా, ఆయన అభినందించారు. సిస్మితరెడ్డి తన తాత రిటైర్డ్ ఎస్ఐ మల్లారెడ్డి ప్రోత్సాహంతో బాక్సింగ్‌లో రాణిస్తున్నట్లు పేర్కొంది.

## జిల్లా ఉషూ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



బార విద్యాసాగర్



కోడూరి శేఖర్

కొత్తపల్లి, జూన్ 16 : జిల్లా ఉషూ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం స్థానిక ఫండస్ పాఠశాలలో నిర్వహించారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా బార విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా కోడూరి శేఖర్ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా మొయిన్ అహ్మద్, ఎ. శ్రీనివాస్, బి. రాజు, పి. లింగమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా బి. రాన విక్రంగాంధీ, జె. మహేశ్, ఎండీ ముఫాజిల్, పి. నాగరాజు, కోశాధికారిగా కె. అఖిల, కార్యవర్గ సభ్యులుగా జె. విజయ్ సామ్రాట్, జి. శివకృష్ణ, బి. రమేశ్, ఎల్. రవి వర్మ, కె. సత్యనారాయణ, ఎం. శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జి. అజయ్ కుమార్ ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి యోగా కోచ్ వి. కిష్టయ్య వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఉషూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పరమేశ్, మనోహర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 16: రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వివరించేందుకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సభ, సమావేశాలను నిర్వహించి బీసీలను చైతన్యపరుస్తామన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తప్పుడు కేసులతో బీఆర్‌ఎస్‌ను అడ్డుకోలేరు



కేటీఆర్‌కు మద్దతుగా కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే
- బీఆర్‌ఎస్‌వీ నాయకుల డిమాండ్
- కేటీఆర్‌కు మద్దతుగా తెలంగాణ భవన్‌కు పయనం

కార్పొరేషన్/ హుజూరాబాద్ టౌన్/ గంగాధర, జూన్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసులతో బీఆర్‌ఎస్‌ను అడ్డుకోలేదని, వాటిలో నుంచి తమ నాయకులు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌వీ నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతూ, నోటీసులు ఇస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరుకు నిరసనగా, కేటీఆర్‌కు మద్దతుగా సోమవారం జిల్లా నుంచి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద నుంచి వాహనాల్లో పెద్ద సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్‌ఎస్‌పై ప్రజలకు ఉన్న అభిమానాన్ని తగ్గించలేరని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా రాష్ట్ర అభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం పని చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై విమర్శలు మానుకొని వెంటనే ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, నాయకులు అజయ్‌కుమార్‌గౌడ్, బొంకూరి మోహన్, వడ్లకొండ వరకుమారులు, హరీశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు. హుజూరాబాద్ నుంచి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. అక్కడ మాజీ ఎంపీ వినోద్ కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రమేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, సతీశ్ తదితరులు ఉన్నారు. గంగాధర మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్‌కు మద్దతుగా సోమవారం హైదరాబాద్ తరలివెళ్లారు. ఇందులో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, నాయకులు ఆకుల మధుసూధన్, కంకణాల విజేందర్‌రెడ్డి, రామిడి సురేందర్ తదితరులు ఉన్నారు.



తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కలిసిన హుజూరాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద గంగాధర మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

## పోలీస్ ఉద్యోగం అదృష్టంగా భావించాలి

- పీసీలకు బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్‌లో సీపీ గౌష్ ఆలం



మాట్లాడుతున్న సీపీ

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 16: పోలీస్ శాఖలో ఉద్యోగానికి ఎంపికవడం అదృష్టంగా భావించాలని, పోలీసు అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసేందుకు లభించిన మంచి అవకాశమని సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. గతంలో వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఎంపికై వివిధ కారణాలతో శిక్షణకు వెళ్లలేని 91 మందికి 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ స్థానిక కరీంనగర్‌లోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల(పీటీసీ)లో సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ హాజరుకాగా, పీటీసీ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన పోలీస్ కమిషనర్, పీటీసీ ఆవరణలో మొక్కను నాటారు. ఎస్సీటీ పీసీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఈ శిక్షణను ఎంతో క్రమశిక్షణతో నేర్చుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకునే అంశాలే రేపు సర్వీసులో ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అడిషనల్ ఎస్పీ ఎ. పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ బి. మోహన్ (డీఎస్పీ), డీఎస్పీలు మల్లికార్జున్, మహేశ్ బాబు, శ్రీనివాస్, విజయపాల్ రెడ్డి, గంగాధర్, శివరామయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

***సెక్టార్, ఇన్వెస్టిగేటింగ్ అధికారులకు శిక్షణ***

కరీంనగర్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో సెక్టార్, ఇన్వెస్టిగేటింగ్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న 35 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు సోమవారం కరీంనగర్ సీటీసీలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, ఈ శిక్షణలో భాగంగా ఫిర్యాదు తీసుకోవడం నుంచి ఎఫ్ఐఆర్ నమోదు, ఇన్వెస్టిగేటింగ్ విధానం, సాక్షుల స్టేట్‌మెంట్ రికార్డు చేయడం, వంటి పలు అంశాలపై పూర్తిగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనరేట్ ట్రైనింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్లు సంతోష్ కుమార్, శ్రీనివాస్, సరిలాల్, బిల్లా కోటేశ్వర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 16: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ల మరమ్మతులు, మిడిల్ పోల్స్, ఇతర మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2, కరీంనగర్ రూరల్ ఏడీఈ రఘు తెలిపారు. ఉదయం 9నుంచి 10.30గంటల వరకు బైపాస్ ఏరియా, ఎన్టీఆర్ విగ్రహం నుంచి సబ్ స్టేషన్ వరకు, ఉజ్వల పార్క్ ఏరియా, పాలిటెక్నిక్ కాలేజీ, ఐటీఐ కాలేజీ, హోటల్ శ్రద్ధ ఇన్ ఏరియా, మాతృభూమి అపార్ట్‌మెంట్, ఉదయం 8నుంచి 10గంటల వరకు పొన్నం కాంప్లెక్స్ ఏరియా, శ్రీరామ బుక్ స్టాల్ ఏరియా, అన్వర్ టీ స్టాల్ ప్రాంతం, మంకమ్మతోట, బృందావన్ అపార్ట్ మెంట్, గీతాభవన్ ఏరియా, టూ టౌన్ పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, ఆర్బీ స్వీట్ హౌస్, ముకరంపుర, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు ఇరుకుల్ల గ్రామం, మొగ్ధుంపూర్ వ్యవసాయం, మొగ్ధుంపూర్ రైస్ మిల్లుకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## సంతానం కలుగడం లేదని వివాహిత ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 16: సంతానం కలుగడం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నది. సైదాపూర్ ఎస్ఐ తిరుపతి, కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకునూర్ గ్రామానికి చెందిన జెల్ల సతీశ్, తేజశ్రీ దంపతులు. పెళ్లై ఐదు సంవత్సరాలు కావస్తుండగా, వారిని సంతానం కలుగలేదు. మనస్తాపం చెందిన తేజశ్రీ ఈనెల 13న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు జమ్మికుంటకు, అక్కడ నుంచి హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయింది. తేజశ్రీ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వావిలాల పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ

జమ్మికుంట, జూన్ 16: వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మసీ, ల్యాబ్‌లతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని క్షమించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ హెచ్‌ఈ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ సదానందం, ఫార్మసిస్టు శ్రీధర్, టెక్నీషియన్ రామకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్, తదితరులున్నారు.

## తెగి పడిన విద్యుత్ తీగ



దుర్శేడ్ బుడిగ జంగాల కాలనీలో తెగి పడిన తీగ

కరీంనగర్ రూరల్, జూన్ 16: దుర్శేడ్ గ్రామంలోని బుడిగ జంగాల కాలనీలో సోమవారం రోడ్డు పైన విద్యుత్ తీగ తెగి పడడంతో కాలనీ వాసులు ఆందోళన గురవుతున్నారు. 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభం నుంచి తీగ తెగి పడిందని, అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై విద్యుత్ తీగను తొలగించాలని కోరుతున్నారు.

## పారిశుధ్యం మెరుగుపరచాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, జూన్ 16: కరీంనగర్‌లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం నేపథ్యంలో సోమవారం నగరంలోని లక్ష్మీనగర్, ఆదర్శనగర్, మంచిర్యాల చౌరస్తా తదితర ప్రాంతాలను పారిశుధ్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఆదర్శనగర్ వద్ద మద్యం దుకాణాదారులు షాపు ఎదుట పరిసర ప్రాంతంతో పాటు డ్రైనేజీల్లో చెత్తను వేసినందుకు రెండు షాపులకు జరిమానా విధించాలని ఆదేశించారు. అధికారులు రెండు షాపులకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. లక్ష్మీనగర్‌లోని ఖాళీ స్థలంలో నిలిచిన వర్షం నీటిని కచ్చా నాలా ద్వారా తొలగించి, స్థల యజమానికి జరిమానా విధించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రోడ్లు, పరిసర ప్రాంతాల్లో చెత్త వేయడం పూర్తిగా నిషేధించామన్నారు. నిబంధనలు అతిక్రమించి చెత్తను పరిసరాలు, డ్రైనేజీల్లో వేస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామి, శానిటేషన్ ఇన్ స్పెక్టర్లు నర్సోత్తమ్‌రెడ్డి, శ్రీధర్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది, జవానులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

గంగాధర, జూన్ 16 : మండలంలోని వెంకటాయపల్లిలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సోమవారం గంగాధర పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. మండలంలోని వెంకటాయపల్లి గ్రామానికి చెందిన ఉప్పుగండ్ల గంగారెడ్డి ఇంట్లో ఈ నెల 8న దొంగలు పడి బీరువాలోని 33 తులాల బంగారు నగలు, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన పోలీసులు, ఈ నెల 13న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 20 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని, జైలుకు తరలించారు. కాగా, ఇదే కేసులో మరో నిందితుడు చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన పిట్టల అరవింద్‌ను సోమవారం అరెస్టు చేసి అతడి నుంచి 3 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసుకు సంబంధించిన మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఇక్కడ ఎస్ఐ వంశీకృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఆలయంలో పట్టపగలు చోరీ

శంకరపట్నం, జూన్ 16: కేశవపట్నం శివాలయంలో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. ఓ బాలుడు హుండీ తాళం తెరిచి అందులోని దాదాపు రూ.1500 నగదు ఎత్తుకెళ్లాడు. చోరీ ఘటనను ప్రత్యక్షంగా చూసిన పలువురు యువకులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఆలయ అర్చకుడు నాగరాజుకు అప్పగించారు. బాలుడిని పోలీసులకు అప్పగించినట్లు అర్చకుడు తెలిపారు.

***చీమలకుంటపల్లెలో..***

గన్నేరువరం, జూన్ 16: చీమలకుంటపల్లి గ్రామంలో బామాండ్ల సరోజన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. సరోజన ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లింది. ఆదివారం ఇంటికి తిరిగి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి, బీరువాలోని పావుతులం బంగారం, వెండి పట్టీలు, నగదు దోచుకెళ్లారని సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నారు మడిపై గడ్డి మందు పిచికారీ

శంకరపట్నం, జూన్ 16: మండలంలోని గుడాటిపల్లి గ్రామానికి చెందిన రైతు అన్నాడి తిరుపతిరెడ్డి వానకాలం నాటుకు మూడు ఎకరాలకు సరిపడే నారు మడి వేశాడు. కాగా, ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో వరి నారు మాడిపోయింది. దుండగులను పట్టుకుని చట్టపరమైన చర్యలు చేపట్టి, తనకు న్యాయం చేయాలని సోమవారం కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

## జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

తెలంగాణచౌక్, జూన్ 16 : జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు శాతవాహన యూనివర్సిటీ కార్మికులు సిద్ధంగా ఉన్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు శాతవాహన యూనివర్సిటీ కమిటీ సమావేశం యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు. ఇక్కడ సమ్మె బుక్‌లెట్స్ ఆవిష్కరించారు. యూనియన్ అధ్యక్షుడు ముల్కల దేవేందర్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కోశాధికారి రాజు రజిత, ఉపాధ్యక్షుడు రాజమల్లు, కనుకయ్య, దాసు, దినేశ్, పులి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి దయామణి, సభ్యులు పరుశురాం, రాజేందర్, శంకరయ్య, సందీప్, మహేంద్ర పాల్గొన్నారు.

## ఎల్ఎల్ఎం ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, జూన్ 16: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా, ఏప్రిల్ – 2025లో నిర్వహించిన ఎల్ఎల్ఎం మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు http://103.119.113.107:89, www.satavahana.ac.in లలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

## 'ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి'

కమాన్‌చౌరస్తా, జూన్ 16 : జిల్లావ్యాప్తంగా విద్యాహక్కు చట్టం, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలుకు చర్యలు చేపట్టాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు కేషబోయిన రాము, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ జిల్లా నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ

కలెక్టరేట్, జూన్ 16 : ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 307 మంది తమ అర్జీలను అధికారులకు అందజేసి, సమస్యలను విన్నవించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ దరఖాస్తులు స్వీకరించి, ఆయా శాఖల అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కాగా, జిల్లాలో ప్రతి సోమవారం ప్రజావాణికి వచ్చి పెన్షన్‌లు మంజూరు చేయాలంటూ వేడుకుంటున్న వారి సంఖ్య రెండంకెలు దాటిపోతున్నట్లు తెలుస్తున్నది. వారం వారం క్రమం తప్పకుండా వస్తూ, దరఖాస్తులందజేస్తున్నా తమకు ఇప్పటికీ పెన్షన్ మంజూరు కావడం లేదని వాపోతున్నారు. అయినా, నేడు కాకపోతే రేపైనా తమకు న్యాయం లభిస్తుందనే ఆశతో బాధితులు ప్రజావాణికి వస్తూనే ఉన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై అధికారులకు వినతిపత్రాలు అందజేస్తూనే ఉన్నారు.

### మాకు పెన్షన్ మంజూరు చేయరు?



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన జమ్మికుంట పట్టణ మహిళలు

పై ఫొటోలో కనిపిస్తున్న మహిళలు జమ్మికుంట పట్టణంలోని పలు కాలనీలకు చెందిన వారు. వీరి పేర్లు వరుసగా ఇనుగాల రాణి భర్త రవి, ఎరబాటి సుజాత భర్త సుధాకర్, కాసర్ల శారద భర్త శ్రీనివాస్, బిజిగిరి లక్ష్మి భర్త శంకర్. కుటుంబ పెద్దలైన వారి భర్తలు వివిధ అనారోగ్య కారణాలతో రెండేళ్లక్రితం మరణించారు. దిక్కులేని కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే 'చేయూత'ను అందించి ఆదుకోవాలంటూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా పలువురు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పదేపదే చెబుతుండడంతో, వచ్చే పెన్షన్ తమ కుటుంబానికి ఆసరాగా మారుతుందనే ఆశతో ప్రజాపాలనలోనే దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటివరకు వాటికి మోక్షం లభించలేదు. మున్సిపల్ అధికారుల వద్దకెళ్లి అడిగితే సైట్ క్లోజ్ అయింది. ఇంకా తెరవలేదంటూ దాట వేస్తుండడంతో, సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చారు. అయితే ఇక్కడ కూడా సరైన సమాధానం లభించలేదని వారు వాపోయారు. మీ సేవలో దరఖాస్తు చేసి మున్సిపల్ కమిషనర్‌కు ఇవ్వాలంటూ అధికారులు సూచించారని, అసలు మాకు పెన్షన్ మంజూరు చేస్తారా? చేయరా? మేమేం తప్పు చేశాం? మమ్ములను ఎందుకిట్ల ఇబ్బందుల పాలు చేస్తున్నరంటూ ప్రజావాణికి హాజరైన అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

మానకొండూర్/తిమ్మాపూర్/గన్నేరువరం, జూన్ 16: ప్రభుత్వం వైద్యఖర్చుల కోసం అందజేస్తున్న సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురికి వైద్యఖర్చుల కోసం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. అలాగే తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 55మందికి ఎల్ఎండీ కాలనీ క్యాంపు కార్యాలయంలో, గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామ రైతు వేదికలో 23 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లర్నింగ్ ప్రారంభం



పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మనోహర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు

కమాన్‌చౌరస్తా, జూన్ 16 : జిల్లా కేంద్రంలో అత్యాధునిక సౌకర్యాలతో, హోలిస్టిక్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే సీబీఎస్ఈ సిలబస్ అనుసరిస్తూ ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లర్నింగ్‌ను సోమవారం ట్రినిటీ విద్యాసంస్థల కార్యదర్శి, సంచాలకులు దాసరి మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రినిటీ విద్యాసంస్థలు విద్యను ఒక సేవగా భావించి, సమాజానికి మంచి నాయకులను అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. కరీంనగర్‌లోని పిల్లలంతా ప్రపంచ స్థాయి విద్యను స్వగ్రామంలోనే పొందాలన్న దృష్టితో ఈ సంస్థను నెలకొల్పుతున్నామన్నారు. ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో విద్యార్థుల అభివృద్ధికి అనుకూలంగా అత్యుత్తమ ఉపాధ్యాయ బృందం, సమగ్రమైన బోధనా విధానాలు, ప్రపంచ ప్రమాణాలకు సరిపోయే ఆటలు, విశాలమైన ఆటస్థలంతో కూడిన అద్భుతమైన క్రీడా వేదికలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఇక్కడ విద్యాసంస్థల నిర్వాహకులు దాసరి ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'తో ప్రజల కోసం పని చేయాలి

తిమ్మాపూర్ రూరల్, జూన్ 16: ఎమ్మెల్యే ఆన్ వీల్స్ పేరుతో పనిచేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తే మంచిదంటూ మండలంలోని కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జితేందర్ రెడ్డి హితవు పలికారు. సోమవారం గ్రామంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గ్రామాభివృద్ధి కోసం గ్రామంలో వంకరగా ఉన్న 18 ఫీట్ల నక్ష తోవను సరిచేసి 30 ఫీట్ల రోడ్డుగా మార్చామని తెలిపారు. నక్షతోవకు కల్వర్టు అడ్డంగా ఉండడంతో, దాన్ని కొంచెం పక్కకు జరిపి నేరుగా హైవేకి అనుసంధానం చేశామని చెప్పారు. ఇవేవీ తెలియని ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు, గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి రోడ్డు విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పటి సర్వేయర్ సమక్షంలోనే రోడ్డును అభివృద్ధి చేశామని, అందులో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. గ్రామస్తుల ఆశీర్వాదంతో మూడుసార్లు సర్పంచ్‌గా పనిచేసిన తాను, ప్రజల శ్రేయస్సుకు పాటుపడడమే తప్ప ఎవరికీ అన్యాయం చేసిందే లేదన్నారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ పేరుతో ఓ తప్పుడు ఫిర్యాదు సృష్టించి, గ్రామాభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయవద్దని ఎమ్మెల్యేను కోరారు.

## ఐదు కిలోల గంజాయి సీజ్: ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, జూన్ 16: జల్సాలకు అలవాటు పడ్డ ముగ్గురు యువకులు ఒడిశాలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ విక్రయించేందుకు వస్తుండగా.. ఎల్ఎండీ పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్.. ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిందితుల అరెస్ట్ చూపి, వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నాగయ్యపల్లి గ్రామానికి చెందిన గొంటి నగేశ్ అలియాస్ బన్నీ, కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామానికి చెందిన చెప్యాల సాత్విక్ అలియాస్ సన్నీ, వేములవాడ టౌన్ అర్బన్ కాలనీకి చెందిన కుతాడి భరత్ అలియాస్ చింటూ స్నేహితులు. వీరికి గంజాయి తాగే అలవాటు ఉంది. దాంతో ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఒడిశా రాష్ట్రంలో 5కిలోల గంజాయి రూ.5వేలకు కొనుగోలు చేసి ఇక్కడ రూ.లక్షకు పైగా విక్రయించేందుకు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పక్కా సమాచారం మేరకు పోలీసులు తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తు కనిపించిన వారిని ఆపి తనిఖీ చేయగా బ్యాగులో ఐదు కిలోల గంజాయి కనిపించింది. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, వారి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి ఎక్కువ మోతాదులో తెచ్చి ఇక్కడ చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయించాలనుకున్నట్లు నిందితులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ముగ్గురిని మంగళవారం సాయంత్రం అరెస్ట్ చూపి, రిమాండ్‌కు తరలించారు. వీరి వెనుక మరెవరైనా ఉన్నారా.. వీళ్లే వెళ్లారా అని దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులు ముగ్గురు 19ఏండ్ల వారేనని, అందరూ పది, ఇంటర్ చదివి ఆపేసినవారేనని సీఐ తెలిపారు. గంజాయి నిర్మూలనకు సర్కిల్ పరిధిలో చర్యలు చేపడుతున్నామని, యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

## ఫీడర్ చానల్‌ను పరిశీలించిన ఎస్సారెస్పీ అధికారులు

శంకరపట్నం, జూన్ 16: తాడికల్ శివారులోని మొండికుంట వద్ద రైతుల పంట పొలాలకు కాలువ నీటిని సరఫరా చేసే ఫీడర్ చానల్‌ను ఎస్సారెస్పీ అధికారులు పరిశీలించారు. తాడికల్ గ్రామానికి చెందిన రైతు ఆడెపు నర్సయ్య తమ పొలానికి కాలువ ద్వారా సాగు నీరు రాకుండా ఓ రైతు ఫీడర్ చానల్‌ను ధ్వంసం చేసి తమ భూమిలో కలుపుకొని దున్నాడని ఇటీవల ఎస్సారెస్పీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఎస్సారెస్పీ డీఈ కవిత, ఏఈ అస్మాతో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మరోసారి పూర్తిస్థాయి సర్వే జరిపి ఫీడర్ చానల్ నిర్ధారణకు రానున్నట్లు ఈ సందర్భంగా డీఈ తెలిపారు.